# దైవప్రేమను సంపాదించండి

సర్వరూపధరం శాంతం సర్వనామధరం శివం
సచ్చిదానందం అద్వైతం సత్యం శివం సుందరం

ప్రేమస్వరూపులారా!

జగత్తు చాలా చిత్రవిచిత్రములతో కూడి ఉన్నది.

చిత్రంబులు త్రైలోక్య ప
విత్రంబులు భవలతాలవిత్రంబులు స
న్మిత్రంబులు మునిజనవన
చైత్రంబులు విష్ణుదేవు చారిత్రంబుల్

లోకములో ఏది చిత్రము, ఏది విచిత్రము అని నిర్ణయించుకోవటం చాలా కష్టము. కుటుంబము శాంతముగా ఉండవలెనన్న, గృహము దినదినాభివృద్ధి నొందవలెనన్న, దేశము సస్యశ్యామలముగా విలసిల్లవలెనన్న, దీనికి ఐకమత్యము అత్యవసరము. ఐకమత్యమేలేకున్న అనర్థములకు చోటు ఏర్పడి జగత్తంతయు అశాంతికి గురౌతుంది. శాంతి సర్వమానవులకు సుఖాన్ని, ఆనందాన్ని, ఐక్యతను అందిస్తుంది. అనైక్యత, అసంతృప్తి నందిస్తుంది. అశాంతిని చేకూర్చుతుంది. అప్రమేయమైన దివ్యత్వమును మరపింపజేస్తుంది.

## శాంతి స్వరూపుడైన మానవుడు తిరిగి శాంతిని కోరడం అజ్ఞానం

శాంతి ఎక్కడనో లేదు. మనస్వరూపములే శాంతిస్వరూపములు. "సర్వరూపధరం శాంతం". ప్రతి మానవుని స్వరూపమూ శాంత స్వరూపమే. "సర్వనామధరం శివం". అన్ని నామములూ మంగళకరమైనవే. "సచ్చిదానందం అద్వైతం సత్యం శివం సుందరం" ఈనాటి మానవత్వమునందు ఇట్టి పవిత్రమైన భావములు కనిపించుటలేదు. శాంతి మనరూపమే అని చెప్పినపుడు ఎవరూ నమ్మరు. మరి శాంతి ఎక్కడున్నదో చెప్పగలరా? శాంతి నిమిత్తమై

ప్రపంచమంతా వెతుకుతున్నారు. కాని, అది మీయందే ఉంటున్నది. తన ముక్కుపైనున్న అద్దాలను తాను మరచి "నా అద్దములెక్కడ"? అని వెతికే అజ్ఞానివలె కనిపిస్తున్నదీ జగత్తు. శాంతియే మనస్వరూపమై ఉండికూడనూ ఈనాడు శాంతికోసం మనం ప్రాకులాడుచున్నాము. ఈనాడు మానవుడు అనేక కష్టములకు, దుఃఖములకు, విచారములకు గురికావడానికి మూలకారణమేమిటి? తన స్వరూపాన్ని తాను మరిచి, తాను కాని తత్త్వాన్ని విశ్వసించి, దానిని అభిలషిస్తున్నాడు. ప్రతిమానవుడు "నాకు శాంతి కావాలి, నాకు శాంతి కావాలి" అని కోరుచున్నాడు. శాంతి ఎక్కడ చిక్కుతుంది? తానే శాంతిస్వరూపాన్ని ధరించి, శాంతికావాలని కోరుకోవడం ఎంత అజ్ఞానము! మానవులు శాంతినిమిత్తమై అనేక ప్రార్థనలు సల్పుతున్నారు. శంకరాచార్యులవారు పదమూడుమంది శిష్యులతో గంగానదికి స్నానమునకు వెడుతున్న సమయములో ఒక వ్యక్తి ఒక వృక్షముక్రింద కూర్చొని "డుకృఞ్ కరణే", "డుకృఞ్ కరణే" అని ఒక వ్యాకరణ సూత్రమును వల్లిస్తున్నాడు. ఇది పాణినీ వ్యాకరణములోనిది. ఈ పాణినీ వ్యాకరణము వల్లెవేయటంచేత తాను పండితుడు కావాలని అతడు ఆశించాడు. అది చూచిన శంకరాచార్యుల వారు "ఈ పాండిత్యముచేత నీకు లభించే ఫలితమేమిటి? అని ప్రశ్నించారు. "స్వామీ! ఈ పాండిత్యముచేత నేను రాజులసన్నిధి చేరగలను. రాజులు నా పాండిత్యమును మెచ్చి అనేక రకములైన బహుమానములు ఇస్తారు" అని బదులు చెప్పాడు. శంకరులవారు మళ్ళీ "ఈ బహుమానములు ఎంతకాలము పెట్టుకోగలవు"? అని ప్రశ్నించారు. "నేను బ్రతికినంతకాలము ఆశలు నెరవేర్చుకుంటాను" అని బదులు చెప్పాడా వ్యక్తి. అప్పుడు శంకరాచార్యులవారు తిరిగి "మరణించిన తర్వాత ఈ సంగతులన్నీ జ్ఞాపకము ఉంటాయా? పిచ్చివాడా! నీవు ఉన్నప్పుడు, అనుభవించినప్పుడు, నీవు గతించిన తర్వాత మూడు కాలములయందు మరపు రానటువంటి తత్త్వాన్ని గుర్తించడానికి ప్రయత్నించు" అని బోధిస్తూ

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే
సంప్రాప్తే సన్నిహితే కాలే
నహి నహి రక్షతి డుకృఞ్‌కరణే

sri sathyasai vachanamrutam

అని ఆ వ్యక్తిని ఉద్బోధించారు. "పిచ్చివాడా! జన్మించినపుడు ఎవరు నీవెంట వచ్చారు? మరణించినతర్వాత ఎవరు నీవెంట వస్తారు? నీవెంట వచ్చేవారులేరు. నీవెంట పోయేవారు లేరు. కేవలం నీకు నీవే వస్తున్నావు. నీకు నీవే వెడుతున్నావు. అంతా దుఃఖమని నీవు భావిస్తున్నావు. ఈ దుఃఖము, దుఃఖము" కాదు, అని వివరించారు.

పునరపి జననం పునరపి మరణం
పునరపి జననీ జఠరేశయనం
ఇహ సంసారే బహుదుస్తారే
కృపయాపారే పాహిమురారే

## తన చింతన తాను గావించుకున్నవాడే నిజమైన వ్యక్తి

మానవునకు ఎవరూ వెంటరారు. ఎవరూ వెంటరాలేదు. ఒకానొక వ్యక్తి చనిపోయే సమయంలో అతని బంధుమిత్రులంతా చుట్టూచేరి ఏడుస్తుంటారు. ఇంతలో కొంచెం స్పృహ కలిగింది ఈ వ్యక్తికి. చుట్టూవున్నవారిని చూచి "ఎందుకు మీరు ఏడుస్తున్నారు?" అని అడిగాడు. అప్పుడు చుట్టూవున్న బంధువులు "అయ్యా! మీరు పోతున్నారు, దేహాన్ని వదలి పోతున్నారు, ఈ ప్రపంచాన్ని వదిలిపోతున్నారు. ఇంక మీరు తిరిగిరారు. అందుకని మేము ఏడుస్తున్నాము" అని సమాధానము చెప్పారు. అపుడా వ్యక్తి "పిచ్చివాళ్ళల్లారా! నేను సంపాదించిన, సాధించిన, సర్వసంపత్తులుకూడా వదలిపోతున్నానని మీరు భ్రమిస్తున్నారు. ఇందులో నాకేమాత్రము విచారము లేదు. నేను వదలిన సర్వసంపద మీకే చెందుతున్నది. నేను వట్టి చేతులతో పోతున్నాను" అన్నాడు. తన చింతన తాను గావించుకున్నవాడే నిజమైన వ్యక్తి. "నేను ఎవరు?" అని ప్రశ్నవేసుకొని విచారణచేయాలి. అలా ప్రశ్నించుకోకుండా ఎవరిని చూచినా "నీవెవరు? నీవెవరు?" అని అడుగుతూపోతుంటే వచ్చే జవాబు ఏమున్నది. ఇవన్నీ భ్రమతో కూడిన దుఃఖములే. వివాహము కాక పూర్వము భర్త ఎవరు? భార్య ఎవరు? చనిపోయినతర్వాత ఎవరికి ఎవరు? ఎవ్వరు కూడా రారు. ఎవ్వరూ లేరు. ఇలాంటి అనిత్యము అశాశ్వతము అయిన దేహాన్ని పట్టుకొని మనము ప్రాకులాడుతున్నాము. "ఎవరికి వారే యమునాతీరే" కనుక, ఈ సత్యాన్ని మనము గుర్తించుకుంటూ రావాలి. మన శాంతి మనకు లభించాలి. మీ హృదయము

sri sathyasai vachanamrutam

నందే ఉన్నది ఈ శాంతి. నీ హృదయములోపల ఉన్న శాంతిని వదిలిపెట్టి ఎక్కడో బయటి ప్రపంచములో వెతకటానికి పోతున్నావు. బయటి ప్రపంచములో ఎక్కడ వెతికినా శాంతి మనకు లభించదు. ఎక్కడికి పోయినా అశాంతి-అశాంతి- అశాంతియే. నీవు కోరేటటువంటి శాంతి నీ దగ్గరనే ఉంటుంది. నీయందున్న శాంతిస్వరూపమైన దైవత్వాన్ని ఈనాడు మరిచి బయట కనిపించే అస్థిరము, అశాశ్వతమైన శాంతిని నీవు ఆశిస్తున్నావు. కనుక, ఈ చింతను నీవు మానుము. స్వస్వరూపమైన శాంతిని చింతించడానికి ప్రయత్నించు. నీవు దేనిని ఆశిస్తున్నావో అది నీయందే ఉంటున్నది. నీ కంటే అతీతమైన వస్తువు బయట ఏదీ కనిపించటం లేదు. కన్నులు తెరచితివా ఇన్నివేలమంది నీకు కనిపిస్తున్నారు. కాని, కన్నులు మూసితివా ఒక్కరూ కనిపించుట లేదు. ఈ చర్మచక్షువులు ఉండినంతవరకు ఇవన్నీ కనిపిస్తుంటాయి. ఈ చర్మ చక్షువులు పోతూనే ఏ వస్తువూ మనకు కనిపించదు. కన్నులు మూసినా తెరచినా కనిపించే వస్తువు ఒక్కటే; అదియే దైవత్వము. ఈ దైవత్వము ఎట్టి మార్పులూ చెందదు. దీనికి ఏమాత్రమూ జననమరణాలు లేవు. అట్టి నిత్యసత్యమైన తత్త్వము నీవే అయి ఉన్నావు. ఈ సత్యాన్ని నీవు గుర్తించుటకు ప్రయత్నించు.

ప్రేమయే మన స్వరూపము.

ప్రేమస్వరూపులారా! ఏది మన సత్యము? ప్రేమయే మన సత్యము. ఈ ప్రేమయే లేకపోతే మనకు ఏదీ జగత్తులో కానరాదు. ఈ ప్రేమయే మనయొక్క స్వరూపము. కనుక, ఇట్టి ప్రేమస్వరూపాన్ని మనము పొంది, అప్రియమైన వస్తువులను ఆశించి పరితపిస్తున్నాము. ప్రేమస్వరూపులారా! మనము ఉండి ఆశించేది దేనిని? ప్రేమను మాత్రమే. మనము ఉండి అనుభవించేది ఏమిటి? ప్రేమను మాత్రమే. అనుభవించేది, ఆనందించేది, పరితపించేది, ప్రేమనే. ప్రేమ తప్ప మరేదీ జగత్తులో శాశ్వతమైనది లేదు. అట్టి నిత్యసత్యమైన ప్రేమతత్త్వాన్ని మనయందే ఉంచుకొని దేనినో ప్రయత్నపూర్వకంగా వెతుకుతున్నావు. ముఖ్యంగా మనము యోచించవలసినది, మనస్వరూపము ఏమిటని. ప్రేమయే మన స్వరూపము. "సర్వరూపధరం శాంతం, సర్వనామధరం శివం". అదియే ప్రేమతత్త్వము. అందరియందున్న ప్రేమ ఒక్కటే. ఎదుటివానిని చూచి నీవు ద్వేషిస్తున్నావు. నీ స్వంతవానిని చూచి నీవు ప్రేమిస్తున్నావు. ఇదియే

srisathyasai vahini.org

నీలో ఉన్న దోషము. ఈ ద్వైతభావము నీలో ఉన్నంతవరకూ అద్వైతము నీకు చిక్కదు. A man with dual mind is half-blind. ఎదుటివాడు పరాయివాడనుకుంటున్నావు. నీ ఇంటిలోని వాడు స్వంతవాడనుకుంటున్నావు. ఇది చాలాపొరపాటు. అందరూ నీ స్వరూపములే. అలాంటి ఏకత్వమును మనము అనుభవించాలి. "అద్వైత దర్శనం జ్ఞానం" అన్నారు. "సర్వులయందూ ఉన్నది నేనే. నాయందున్నది సర్వులు" అనే భావన పెంపొందించుకో! ఆ స్వరూపమూ ఈ దేహమునందే ఉన్నది. సర్వదేహములందూ ఏ ఆత్మ ఉన్నదో ఆ ఆత్మ నీయందుకూడా ఉన్నది.

దేహాభిమానమును మరచి ఆత్మాభిమానమును పెంచుకో

ప్రేమస్వరూపులారా! మీయందున్న ఆత్మయే పరులయందుకూడా ఉన్నది. సర్వభూతాంతరాత్మయైన దివ్యత్వమును అనుభవిస్తూకూడను ఏదో పరాయిదానిని అనుభవిస్తున్నానని భ్రమిస్తూ ఉంటాడు మానవుడు. ఇది అజ్ఞానమువలన ఏర్పడిన భావన. ఒకతూరి ఒక కుక్క ఆహారముకొరకు వెతుకుతూ పోతున్నది. ఒక ఎండిపోయిన ఎముక చిక్కింది దానికి. దాన్ని గట్టిగా కొరుకుతున్నది ఆశతో. ఇంతలో ఆ ఎముక ముక్క విరిగి దంతములో చిక్కుకుంది. తక్షణమే రక్తము వచ్చింది. ఆ రక్తమును రుచిచూచి కుక్క ఆనందిస్తున్నది. "తాను కొరికిన ఎముకముక్కనుండి వస్తున్నదీ రక్తము" అని భ్రమిస్తున్నది. నిజానికి అది తన రక్తమే. అదేవిధంగా ఈ నాటి మానవుడుకూడా తనయందున్న ఆనందమును తాను మరచి ఈ ఆనందము బయటినుండి లభిస్తున్నదని విశ్వసించి, కేవలం ఆనందమును అనుభవించుటకు ప్రయత్నిస్తున్నాడు. ఇది చాలా పొరపాటు. ప్రతి ఒక్కటి తననుండియే వస్తున్నాయి. దుఃఖముకాని, ఆనందముకాని, నీ భ్రమయే. The pleasure is an intervel between two pains. రెండు దుఃఖముల మధ్యలోనే ఒక ఆనందము లభిస్తుంది. కనుక, ఆనందము, దుఃఖము ఈ రెండూ మనయందే ఉంటున్నవి కాని బయటినుండి రావటంలేదు. ఈవిధంగా మనము విచారణ చేయాలి. దీనినే నిన్ను నీవు వెతుక్కోమని చెప్పింది వేదాంతము. ఒక చిన్న ఉదాహరణ ఒకనాడు ఒక ఐ.ఏ.ఎస్. ఆఫీసరు ఒక తాలూకాలో క్యాంపు వేసుకొని ఒక ఇంటిలో ఉండటానికి వచ్చాడు. ఆ ఇంటిలో

sri sathyasaivachanamrutam

భూతాలున్నాయని అతనిని అందరూ బెదిరిస్తూ వచ్చారు. "సార్! ఆ ఇంటిలో భూతములుంటున్నాయ"ని చెప్పారు. అప్పుడు ఆఫీసరు "ఏమిటి అందరూ ఇదేవిధంగా చెప్పుతున్నారు. ఆ ఇంటిలో పిశాచము ఉంటున్నదా? చూస్తాము" అని తనలో తాను నిర్ణయించుకున్నాడు. లైటు తీసి, చిన్న బెడ్‌లైట్ వేసుకొని కాలుమీద కాలు వేసుకొని ఆడిస్తూ ఏదో విచారణచేస్తూ ఉండిపోయాడు. అతని కాలుయొక్క నీడ గోడపై కనిపించింది. అక్కడకూడా ఏదో ఆడుతున్నట్లు కనిపించింది. అప్పుడు ఈ అజ్ఞాని "అదిగో వచ్చింది దయ్యం! దాన్ని పట్టి కొట్టాల"ని ప్రక్కనున్న పిస్తోలుతీసి పేల్చాడు. ఈ తొందరలో అతని వేలికే దెబ్బతగిలింది. ఈవిధంగా తన నీడను చూచి తాను భ్రమించి సమస్త బాధలకు గురౌతుంటాడు మానవుడు. సర్వులూ దైవస్వరూపులే! "ఏకం సత్ విప్రాః బహుధా వదంతి" అలాంటి ఏకత్వాన్ని మనము విశ్వసించాలి. అలాంటి దివ్యత్వాన్ని మనము సాధించాలి. అనేకత్వములోనున్న దివ్యత్వమును మనము పొందాలి. అప్పుడే మన బాధలు, దుఃఖములు, భ్రమలు నశించిపోతాయి. పుట్టినప్పటినుండి ఈ జగత్తులో సంచరించి జగత్తులోనున్న భ్రమలనంతా మనము వరించి తద్వారా ఈ భ్రమలను పెంచుకుంటూ వచ్చాము. ఎవరిని చూచి నీవు బాధపడినా అదికూడా నీకే. ఎవరిని చూచి నీవు ఆనందించినా అది నీకే. దుఃఖముకాని, ఆనందముకాని, మరొకరివి కాదు. కనుక, దేహసంబంధమైన భ్రాంతులు కొంతవరకు తగ్గించుకుంటూ రా! దేహాభిమానమును మరచిపో! ఆత్మాభిమానమును పెంచుకో. అప్పుడే దివ్యమైన భావము నీలో ప్రవేశిస్తుంది.

ప్రేమస్వరూపులారా! ప్రతి మానవునియందు నిత్యసత్యమైన ప్రేమ ఒక్కటే ఉంటున్నాది. ఆ ప్రేమను మీరు దృఢంగా పెట్టుకోండి. ఆ ప్రేమ ఒక్కటే మీకు శాంతి నందిస్తుంది. ఆ ప్రేమ ఒక్కటే మీకు ధైర్యమును చేకూర్చుతుంది. కనుక, ప్రేమ ఒక్కదానిని సంపాదించుకుంటే చాలు. ఆ ప్రేమయే దైవము. దైవమే ప్రేమ. ఆ ప్రేమయందే మీరు నివసించండి. మీ జీవితమంతా ప్రేమతోనే గడపండి. ఈ ప్రేమతత్త్వము మీయందే ఉన్నది.

**అన్నిరూపములందు ఉన్న దివ్యత్వము ఒక్కటే**

ప్రేమస్వరూపులారా! మనము ప్రకృతిలో అనేక రూపాలను చూస్తున్నాము. ఏ రూపము

sri sathyasai vahini amrutham

చూచినా ఒక రూపమునకు మరొక రూపమునకు సంబంధము లేకుండా ఉంటున్నది. రూపనామములు భేదముగా కన్పిస్తున్నవి. అవస్థలు వేరువేరుగా కన్పిస్తున్నవి కాని, అన్ని రూపములందు ఉన్న దివ్యత్వము ఒక్కటే. ఈ ఏకత్వాన్ని మరచిపోకుండా చూచుకోవాలి. మానవుడు దేనికోసం వచ్చాడు? తన్నుతాను తెలుసుకోవటంకోసం వచ్చాడు. పవిత్రాత్మస్వరూపులారా! నిజంగా ఇట్టి సత్యమును తెలుసుకోవడం చాలా సులభము. నిన్ను నీవు తెలుసుకోవటంకంటే సులభమైనది మరొకటి లేదు. ఇతరులను తెలుసుకోవడం కష్టము కాని, నిన్ను నీవు తెలుసుకోవటం చాలా సులభము. కనుక, నిన్ను నీవు తెలుసుకోవటానికి తగిన సాధనలు చేయాలి. దేహానికి అనేక రకములైన జబ్బులు ఏర్పడుతూ ఉంటాయి. అనేక రకములైన ట్రబుల్స్ వస్తుంటాయి. ఆహార విహారములచేత దేహమునకు కలిగే బాధలకు మనము ఏమాత్రమూ క్రుంగిపోకూడదు. వాటిని ఏమాత్రము లెక్కచేయకుండా "మనము వచ్చిన పని ఏమిటి?" అని విచారణ చేయాలి. మీరందరూ ఇక్కడికి వచ్చి చేరారు. ఎందుకోసం వచ్చారు మీరు? చదువుకోసం వచ్చి చేరారు. వచ్చి ఉండేది చదువుకోసం అని. కాని, వెతికేది ఏమేమో. "మనము ఎందుకోసం వచ్చాము? దానికి తగిన ప్రయత్నము చేస్తున్నామా?" అని ఎవరికి వారు ప్రశ్నించుకోవాలి. అప్పుడే మనము వచ్చిన పని సక్రమముగా నెరవేర్చుకోగలము. అయితే, ఈనాడు దీనికి విరుద్ధంగా వచ్చిన పని మరచి లేనిదానిని వెతుకుతూ వస్తున్నాము మనము. ప్రపంచములో అనేకమంది చింతలు జరుపుతూనే ఉన్నారు. నా యొక్క జీవితము ఎట్లా పోతుందో అని విచారణచేసుకుంటారు. మనము పుట్టింది పెరగటం కోసమే. పెరిగింది సాధించటం కోసమే. సాధించిన దానిని సత్యాన్ని తెలుసుకోవటమే. సత్యాన్ని తెలుసుకోవటానికి తగిన కృషిచేయాలి మనము. ఈ సత్యాన్ని గుర్తించడానికి ప్రయత్నము చేస్తే సర్వమూ మనకు అర్థమవుతుంది. కనుక ప్రేమచేతనే సత్యాన్ని గుర్తించాలి. చూడండి, ఎక్కడ చూచినా బల్బులన్నీ వెలుగుతున్నాయి. ఈ బల్బులు అనేక రకాలుగా కన్పిస్తున్నాయి. కానీ, ప్రతి బల్బునందున్నదీ కరెంటే. ఈ కరెంటు లేకుండా ఈ బల్బులు వెలగవు. మన యందున్న ఆత్మయే మెయిన్ స్విచ్. ఆ ఆత్మయే చెవులలో చేరి శబ్దముగా వినిపిస్తున్నది. కన్నులలో చేరి దృశ్యముగా కన్పిస్తుంది.

అన్నిటికీ కరెంటే మూలాధారము. అదియే దివ్యత్వము. అదే చైతన్యము. అట్టి చైతన్యమును మనము విస్మరించినాము. చైతన్యమును మనము ఎప్పుడూ వదలకుండా ఉండాలి. మన

srisathyasaivacahnamrutam

దేహములో ఈ చైతన్యము ఉన్నంతవరకు మనము ఇక్కడ చైతన్యస్వరూపకంగా ఉంటాము. ఈ చైతన్యమును అర్థము చేసుకోవటానికి ప్రయత్నించాలి. చైతన్యము ఎక్కడినుండో రావడంలేదు, ఎక్కడికోపోవడంలేదు. అక్కడనే ఉంది. అక్కడికే పోతున్నది. ఆధ్యాత్మిక తత్త్వములో మనం ఈనాడు అనేక రకములైన అపోహలకు, సందేహములకు గురౌతున్నాము. ఈ సందేహముల వల్ల మనము చాలా పిచ్చివారమై పోతున్నాము. కనుక మొట్టమొదట మనం ఈ అపోహలను, సందేహములను దూరంచేయాలి. అది ఉన్నంతవరకు సత్యాన్ని మనము చూడలేము.

## పవిత్రమైన భావములను హృదయములో నింపుకో

ప్రేమస్వరూపులారా! ముఖ్యంగా మీరు సందేహములను ఎక్కువ చేర్చుకోకూడదు. వాటివలన మానవుడు తన్ను తాను మరచిపోయే పరిస్థితి ఏర్పడుతుంది. విశ్వాసము చాలా ప్రధానమైనది. ఇది బలమైన నమ్మకముగా ఉండాలి. ఆ నమ్మకమే లేకపోతే నీవు కేవలం గ్రుడ్డివాడైపోతావు.

కనులుండి గ్రుడ్డులై కళ్యాణకరమైన
నీ మూర్తి దర్శింప నేరరైరి
చెవులుండి చెవుటులై అతి మనోహరమైన
నీ వాక్కు నాలింప నేరరైరి
పాణి పంకజమందు పరమాత్మ ఉండియు
పాడు సంసారము కోరుచుంద్రు

ఇదే సూరదాసు చెప్పాడు: "నేను కన్నులుండినప్పుడు ఏమి కోరినాను? ఇప్పుడు కన్నులు పోయిన తరువాత మాత్రము ఏమి కోరుతున్నాను? కనులుండినపుడు ఏమి చూచినానో దానినే ఇప్పుడు కోరుతున్నాను", అని. కనులున్నా లేకున్నా కనిపించేది ఒక్కటే. అదే Divine vision, దివ్యకాంతి. ఆ చైతన్యముయొక్క తత్త్వము మనస్సునందుంచుకోవాలి. ఆ ఈరి-ఖీరిదీలి జిరివీనీశి ప్రతివ్యక్తియందు ఉంటున్నది. ఆ లైటులేకుండా ఈలైట్లు ఏవీ రావు. కనుక మెయిన్ లైట్ ఆత్మయే. దీన్ని పురస్కరించుకొనియే శంకరులవారు భారతదేశమంతా సంచరించి

"భజ గోవిందం" అనే దివ్యతత్త్వమును ప్రచారము చేశాడు. "ఏమిటి ఇదంతా! దేనిని చింతించాలో దానిని చింతించటం లేదే! భజగోవిందం – దైవత్వాన్ని నీవు చింతించు. దైవత్వము కానిదానిని చింతించి ప్రయోజనం ఏమిటి?" అని హెచ్చరించారు, ఆదిశంకరులు. మనం సదా చింతించవలసింది దైవచింతనయే. నిజానికి దైవము ప్రత్యేకముగా లేదు. నీవే దైవము. You and I are one. అరిషడ్వర్గములే మానవునియొక్క దురాచారములకు మూలకారణము. పశువులకు కూడా ఉన్నాయి ఈ అరిషడ్వర్గములు. మనిషికి ఉన్నాయి. అయితే మనిషికి , పశువుకు భేదము ఏమిటి? పశువులు భుజిస్తున్నాయి. పశువులు నిద్రిస్తున్నాయి. పశువులు ఆశలు అనుభవిస్తున్నాయి. మనిషి నిద్రిస్తున్నాడు. మనిషి అనుభవిస్తున్నాడు. భేదము ఏమిటి? "ప్రజ్ఞానం బ్రహ్మ". ఆ ప్రజ్ఞానమే మనిషికి ప్రత్యేకంగా ఉండేటువంటిది. ఆ ప్రజ్ఞానమనే వివేకమున్నప్పుడు ఏమాత్రము దుఃఖించడు. అన్నీ వచ్చినాయి, పోతున్నాయి. ఈ కదిలిపోయే మేఘములను పట్టుకొని ఎందుకు విచారించాలి? కదిలిపోని తత్త్వాన్ని మనం పట్టుకోవాలి. అదియే మన ఆత్మతత్త్వము. అదియే మన చైతన్యతత్త్వము. అదియే మన దివ్యత్వము. అదియే మన పవిత్రము దానిని తెలిసికొంటివా "బ్రహ్మ విత్ బ్రహ్మైవ భవతి". నిన్న చెప్పాను, "మమైవాంశో జీవలోకే జీవ భూతస్సనాతనః" అనే శ్రీకృష్ణపరమాత్మ యొక్క ప్రకటన గురించి. అందరియందున్నది నా అంశమే అన్నాడు శ్రీకృష్ణుడు. అయితే, ఈ అంశము లోపల కనిపించే విచారములు, దుఃఖములు, కష్టములు, క్రోధములు ఇవన్నీ ఎక్కడినుంచి వచ్చాయి? పశుత్వముతోకూడిన భావాలు మన హృదయములో నింపుకున్నాము. ఈ పశుత్వములో నింపుకున్న భావాలు దూరంగా పంపించు. తరిమివేయి. Run away from bad company. సత్యమైన నిత్యమైన భావాలు నింపుకో. కప్పులో జలము ఉన్నది. ఆ కప్పులో పాలు పోయాలంటే ఉన్న జలమును పారబోయాలి గదా! అట్లులేకుండా జలములోపలనే పాలుకూడా పోస్తే జలమూ పాలూ రెండూ వ్యర్థమైపోతాయి. నీ హృదయమునిండా దుర్మార్గమైన భావాలు నింపుకున్నావు. అలాంటి దుర్మార్గమైన భావాలపై, సన్మార్గమైన విషయాలు నింపుకుంటే అవి, ఇవి రెండూకూడ చెడిపోతాయి. ఏదీకూడ నీకు అక్కరకు రాదు. కనుక నీవు చెడ్డను దూరముచేయి. పవిత్రమును హృదయములో నింపుకో. అప్పుడు నీవు పవిత్రమైన జీవిగా మారతావు. మనం పవిత్రులు కావాలను కున్నప్పుడు మన పాత్ర పరిశుభ్రముగా పెట్టుకోవాలి. కేవలం ఖాళీగా



sri sathyasai vahinimrutam

పెట్టుకోవాలి. హృదయము పవిత్రముగా పెట్టుకున్నప్పుడు దానిలో అన్నీ నింపుకోవచ్చును. మనం ఎన్ని వస్తువులు సంపాదిస్తున్నాము? ఎంత ధనము సంపాదిస్తున్నాము. కానీ, చివరకు ఇవన్నీ ఎక్కడికి పోతున్నాయి? కడపటికి ఎవరికి చెందుతున్నాయి ఇవన్నీ. జానెడు పొట్ట నింపుకొనే నిమిత్తమై లక్షలు సంపాదిస్తున్నాము. ఈ సంపాదనంతా కడుపు నింపుకుంటున్నామా? లేదు లేదు. క్షణభంగురమైన జీవితము కోసమని ఇన్ని అవస్థలకు గురౌతున్నాము. మనదేహమే అనిత్యము ఇదంతా ఒక water bubble వంటిది. Mind is like a mad monkey; don't follow the mind. Don't follow the body; follow the conscience; follow love. ఇదియే ఈనాడు మనము చదువులోపల నేర్చుకోవలసినది.

మన హృదయాన్ని ప్రేమతో నింపుకోవాలి

ఎన్నో చదువులు చదువుచున్నారు. "చదువులన్నియు చదివి చావంగనేటికి, చావులేని చదువు చదవవలయు". ఈ చదువులవల్ల మనకి లభించేది ఏమిటి? ఇది ప్రపంచములో ఉండినంతవరకు పొట్టనింపుకోవటానికి ఒక మార్గము అవుతోంది. చదువుకున్నవాడు పొట్ట నింపుకుంటున్నాడు. చదువులేనివాడు, బెగ్గర్ కూడా పొట్టనింపుకుంటున్నాడు. పొట్ట నింపుకోవడమా గొప్పది? మన హృదయాన్ని నింపుకోవాలి. హృదయాన్ని ప్రేమతో నింపుకోవాలి. ప్రేమయే సర్వస్వాన్ని అందిస్తుంది. హృదయాన్ని నింపుకోవటానికి ప్రయత్నించు. అదియే compassion. హృత్ దయ హృదయం. దయతో నిండినది, హృదయము. ఆ హృదయమును ప్రేమచేత నింపుకోవాలి. ఒక్కక్షణంకూడా మనం వ్యర్థంచేయకూడదు. ప్రేమను పెంచుకోవాలి. ఈ ప్రేమను ఈనాడు దూరంచేసి, అపవిత్రమైన మార్గములో ప్రవేశపెట్టి కట్టకడపటికి నిరాశగా మార్చుకుంటున్నారు. కుటుంబములోని సంబంధ బాంధవ్యములన్నీ నీకై నీవు పెంచుకున్నావు. మధ్యలో వచ్చినాయి. మధ్యలో పోతున్నాయి. శాశ్వతమైనవి కానేకాదు. ఇవన్నీ కదిలిపోయే మేఘములవంటివి. ఇలాంటి వాటికోసమై మనము తపించ నక్కరలేదు. నీవు దేనికొరకు విచారించాలి. నీ ఆనందమునకై ప్రాకులాడాలి. నీ ప్రేమయే నీకు చిక్కాలి. ఈ ప్రేమను సర్వులయందు నిరూపించు. ఈనాటి మానవులు ప్రేమను పంచుకోకుండా ద్వేషాన్ని, అసూయను, క్రోధాన్ని పెంచుకుంటున్నారు. ఎన్ని చదువులు చదివి ఏమి ప్రయోజనము? కట్టకడపటికి మనం ప్రేమను పంచుకోవటంలేదు. ద్వేషము, ద్వేషము ఇది మహారాక్షసత్వం.



sri sathyasaivachanamrutam

ఈ రాక్షసిని మనం పెంచుకుంటున్నామే కాని పవిత్రమైన ప్రేమతత్త్వాన్ని పెంచుకోవటంలేదు. ఏదో కించిత్ ప్రేమలభించెనా, ఆ ప్రేమను తిరిగి పదిమందికీ పంచుకో. అదియే నీ నిజమైన కర్తవ్యము. అట్టి కర్తవ్యమును నీవు నిర్వర్తించి దివ్యమైన మార్గాన్ని పొందు. విద్యార్థులారా! మీరు చదివే చదువులలో కొన్ని కొన్ని సబ్జెక్టులు ఈ లోకానికి సంబంధించినవే. "ఇహమున సుఖియింప హేమతారక విద్య, పరమున సుఖింప బ్రహ్మవిద్య". దానిని మనం పెంచుకోవాలి. అప్పుడే మనకు శాశ్వతమైన ఆనందం లభిస్తుంది.

మానవుని దగ్గరలేనివి, భగవంతుని దగ్గర ఉన్నవి ప్రేమ, శాంతియే

ఇంతసేపు రసగోత్ర చాలా గొప్ప విషయాలు చెప్పాడు. ఆయన చదువు ఆయన చేసిన పనులు, తిరిగిన సంచారము చూస్తే అలాంటివారు ఎవరూ కనిపించడము లేదు. విద్యలో అటువంటిది సాధించినవారు ఎవరూ లేరు. ఉద్యోగములో చూస్తామా అంటే అంత గొప్పస్థితిని పొందినవారు మరెవ్వరూ లేరు. అన్ని ఉండికూడా ఎందుకోసం ఇక్కడికి వస్తున్నాడు. నా ప్రేమ నిమిత్తమై వస్తున్నాడు. వారిదగ్గర లేనిది, నాదగ్గర ఉన్నదని కోరుకొని వస్తున్నారు. నిజంగా ఈ ప్రేమ మీదగ్గరే ఉంటుంటే మీరందరూ ఇక్కడికి ఎందుకు వస్తుంటారు? రానేరారు. ఆ ప్రేమ మీదగ్గర లోపించింది కనుకనే ఇక్కడికి వస్తున్నారు. లేనిదానిని మనము సంపాదించుకోవాలి.

గుజరాత్‌లో ఒక పటేల్ ఉండేవాడు. అతను పరమ భక్తుడు. గొప్పవ్యాపారి. విదేశాల్లో తిరిగి వ్యాపారములో చాలా ధనము సంపాదించుకున్నాడు. ఒకనాడు ఒక విదేశీస్నేహితుడు గుజరాత్ వచ్చి "పటేల్ గారూ మిమ్మల్ని చూడటానికి రావాలనుకుంటున్నాను" అని చెప్పాడు. "తప్పక రావచ్చు" అన్నాడు పటేల్. అతను వచ్చేటప్పటికి ఇతను పూజరూంలో కూర్చున్నాడు. ఎంతసేపైనా పూజచేస్తూనే ఉన్నాడు. ఈ విదేశీయునికి కూర్చొని కూర్చొని బేజారు పుట్టింది. చాలా సేపైన తర్వాత బయటికి వచ్చారు పటేల్‌గారు. అప్పుడా స్నేహితుడు "ఏమిటయ్యా! పటేలు దేనికోసం పూజ చేస్తున్నావు? నీకు కావలసినంత ధనముంది. కాబట్టి, నీవు ధనముకోసం పూజచేయటం లేదు. నీకు కావలసిన సుఖము ఉంది కాబట్టి, సుఖం కావాలనీ కోరటంలేదు. మరి దేనికోసం ఇంతసేపు పూజచేస్తున్నావు?" అని అడిగాడు. పక్కున నవ్వాడు ఆ పటేల్.

srisathyasaivachanamrutam

"సార్! నేను, ప్రాకృతమైన విషయాలను ఆశించి ఏమాత్రము ప్రార్థన చేయడములేదు. ధనము కావాలని ఆశించడం లేదు. సుఖంకావాలని ఆశించటంలేదు. నాకేదీ అక్కరలేదు. నా దగ్గర లేనిది, భగవంతుని దగ్గర ఉన్నది. దానికొరకు నేను దైవాన్ని ప్రార్థిస్తున్నాను" అని బదులు చెప్పాడు. అప్పుడా స్నేహితుడు మళ్ళీ "ఏమిటి నీదగ్గరలేనిది?" అని అడిగాడు. "I want truth; I want love; I want peace. సత్యము, ప్రేమ, శాంతి – ఈమూడూ అతని దగ్గరున్నాయి. భగవంతుడు ఈ మూడింటినీ తన దగ్గరనే పెట్టుకొన్నాడు. వీటిని పొందేనిమిత్తమై నేను ప్రార్థిస్తున్నాను" అని సమాధానము చెప్పాడు. అందువలన మన దగ్గరలేనిదానిని కోరటానికి ప్రయత్నించాలి. మనదగ్గర లేనిదేమిటి? శాంతి. ఆ శాంతిని నీవు కోరాలి. నీదగ్గరున్నదే కోరితే ఎందుకు ప్రార్థన. నీ దగ్గర లేనిది, భగవంతుని దగ్గర ఉన్నవి రెండేరెండు – ప్రేమ, శాంతి. ఈ రెండూ మనము సాధించుకుంటే వాటిద్వారా సత్యము మనకు లభిస్తుంది. చక్కెర ఉంటే ఎన్ని తీపిపదార్థములైనా చేసుకోవచ్చు. గోధుమహల్వా, గులాబ్‌జామ్ మొదలైనవి వేరువేరుగా ఉన్నా స్వీటు ఒక్కటే. కనుక దైవమే ప్రేమ. ఆ ప్రేమను మనము సంపాదించుకుంటే ఆ ప్రేమవలన ఎన్ని పదార్థములనైనా మనము అందుకోవచ్చు. ఎన్ని సుఖములైనా మనము పొందవచ్చును. ఎన్ని శాంతులైనా అనుభవించవచ్చును. కనుక, ప్రేమను మీరు సంపాదించండి బంగారూ!.

(తేది 10-10-2002 సాయంత్రము సాయికుల్వంత్‌హాల్‌లో శ్రీవారు అనుగ్రహించిన దివ్యసందేశము)

sri sathyasai vahini